

# మా ఇంటి మనుషులు

(గతవారానికి కొనసాగింపు)

**ఆనంద్‌ని నాన్నగారు సాదరంగా ఆహ్వానించారు. హాలులో వున్న సోఫాలో అప్పటికే మా ఫ్యామిలీ మెంబర్లందరూ కూర్చుండిపోయారు. నాన్నగారు అందరినీ పేరు పేరున ఆనంద్‌కు పరిచయం చేశారు. పరిచయం చేసేటప్పుడు పేరు, ఫ్యామిలీ రిలేషన్ తప్పించి చదువులు, డిగ్రీల గురించి గాని, హోదాల గురించి గాని ఒక్కమాట కూడా చెప్పకపోవడం నేను గమనించాను.**

అవతలి వ్యక్తి అపరిచితుడైనా కొత్త, పాత అనే భేదం లేకుండా క్షణాల్లో కలసిపోయి కలుపుగోలుగా మాట్లాడుతారు మావాళ్లంతా. అలాగే ఆనంద్‌తో కూడా అందరూ కబుర్లు చెప్పడం మొదలుపెట్టేశారు. విచిత్రం ఏమిటంటే నేను కేవలం ప్రేక్షక పాత్ర వహించవలసి వచ్చింది! నాకు అసలు ఆనంద్‌తో పరిచయమే లేనట్టు. నేనక్కడ లేనట్టే ప్రవర్తిస్తూ వాళ్ళు ప్రవర్తించడం నిజంచెప్పాలంటే- నాకు కొంచెం కోపం కూడా వచ్చింది. ఇంతలో అక్క సౌజన్య నా చెవిపట్టిలాగి "నీ సెలెక్షన్‌కు నేను మార్కులు వేసేశా. మిగతావాళ్ళు ఇప్పుడే 'స్కానింగ్' మొదలుపెట్టారు. అదిప్పుడే తేలేలా లేదు. భోజనం ఏర్పాట్లు చేయడం బెటర్" అంది. నేనుకూడా 'ఔన'న్నట్టు తలూపాను.

మేమిద్దరం గుసగుసలాడుకోవడం చూసిన అమ్మ కళ్లతోనే మాట్లాడవద్దంటూ సైగ చేసింది. అక్క మెల్లగా లేచి అమ్మతో ఏదో చెప్పింది. అమ్మ, అక్క ఇద్దరూ లోపలికి వెళ్ళారు. నేనుకూడా వాళ్ళని ఫాలోఅవబోతుంటే, "ఏయ్. నువ్వెక్కడికి? ఆ మీటింగ్‌లో చీఫ్ గెస్ట్‌వి నువ్వే. అందరూ మాట్లాడేశాక చివర్లో మాట్లాడాల్సింది నువ్వే. వెళ్లి మీటింగ్ ప్రొసీడింగ్స్‌ని నోట్‌చేసుకో" అని నవ్వేసి నన్ను మళ్ళీ సోఫాలో పడేసింది.

నాన్నగారు ఆనంద్‌తో అతని జాబ్ గురించి, ఆఫీస్‌లో వాతావరణం గురించి మాట్లాడారు. మానాన్నగారు పెళ్ళయిన కొత్తలో రైస్‌మిల్‌లో గుమస్తాగా పనిచేసేవారట. ఆ రోజుల్లో ముచ్చట్లను మధ్య మధ్యలో ప్రస్తావిస్తూనే, ఆనంద్ కుటుంబ వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

నాన్నగారిలో ఓ గొప్ప గుణం వుంది. ఎవరినైనా సరే 'ఎంకరేజ్' చేస్తున్నట్టు మాట్లాడతారు. పాజిటివ్‌గా మాట్లాడతారు. ఆయన మాటల్లో 'రిఫరెన్స్'లు ఎక్కువగా వుంటాయి. అన్నయ్యకు, అక్కయ్యకు కూడా అలాగే మాట్లాడడం అలవాటుచేశారు. అదృష్టవశాత్తు బావగారు కూడా అదే ధోరణి కలిగిన వ్యక్తి కావడంతో ఇబ్బంది లేకపోయింది. నాన్నగారు మాట్లాడుతున్నప్పుడు, మధ్య మధ్యలో మాటలు కలిపిన అన్నయ్య మెల్లగా ఆనంద్ 'నేచర్ ఆఫ్ జాబ్' గురించి, మా కంపెనీ మార్కెటింగ్ వ్యవహారాల గురించి, రైవల్ కంపెనీల స్ట్రాటజీస్ గురించి ఆనంద్‌ని అడిగి తెలుసుకున్నాడు. అన్నయ్య, ఆనంద్ మాట్లాడుకొంటుండగా నాన్నగారు మెల్లగా అక్కడినుంచి నిష్క్రమించారు.

"మీరంతా దాదాపు ఒకే వయసువాళ్ళు. మాతరం అయిపోయింది. మాలాంటి వాళ్ళతో మాట్లాడుతుంటే బోర్ కొడుతుందేమో. నాక్కాస్త పనుంది ఎంజాయ్ యువర్‌సెల్ఫ్" అనేసి వెళ్లిపోయారు. నాన్నగారు వెళ్ళగానే అక్క మా అందరికీ కాఫీ తెచ్చింది. నాన్నగారు వున్నంతవరకు చిరునవ్వులు చిందిస్తూ, అప్పుడప్పుడూ ఒకటి, రెండు మాటలు మాట్లాడిన బావగారు, నాన్నగారు నిష్కరమించగానే రెచ్చిపోయారు.

"హమ్మయ్య! సింహం నిష్క్రమించింది" అన్నారు బావగారు.

"మామగార్ని పట్టుకొని సింహం, నక్క అని అంటావా. నాన్నగార్ని రానీ నీ సంగతి తేల్చేస్తాను" అన్నాడు అన్నయ్య.

"ఓయ్ గోపీ. నీ లాయర్ బుద్ది నాపై ప్రయోగించకు. నేనేమి నక్క...మరొకటి అనలేదు. జస్ట్ సింహం అన్నానంతే. అదికూడా చాలు చాలు రెస్పెక్టబుల్‌గా. ఏమండీ ఆనంద్‌గారు అంతేకదూ!" అన్నారు బావగారు. బావగారి పేరు రఘురామ్. కాని అన్నయ్య, అక్కమాత్రం పేరుపెట్టి పిలుస్తారు.

"రఘురామ్! నువ్వీమధ్య మీ మామగారిమీద మరీ ఎక్కువ రెస్పెక్ట్ చూపిస్తున్నట్టు నాకు అనుమానంగా వుంది. ఆయనతో ఏదైనా పనుందా?" అని అడిగాడు అన్నయ్య.

"బాబ్బాబు నన్ను ఇంటరాగేట్ చేయడం మానేయ్. నేను నీ బావగారిని రెస్పెక్ట్. రెస్పెక్ట్ ముఖ్యం" అన్నారు బావగారు.

"భలేవారే! మీకు రెస్పెక్ట్ ఇస్తే మా తమ్ముడి పరువేంగాను?" అంది అప్పుడే అక్కడికి వచ్చిన అక్క.

"ఛ ఛ ఛ..చూడండి ఆనంద్‌గారు. ఇదండీ వరస. ఇంటి అల్లుడిని కదా! ఎంత మర్యాద ఇవ్వాలి! ఎంత గౌరవరం ఇవ్వాలి! అప్పలు..అప్పలు పట్టించుకోరు" అని అంటుండగానే బావగారి





అన్నయ్య సోమసుందర్ వచ్చాడు. సోమసుందర్‌ని బావగారు ఆనంద్‌కి పరిచయం చేశాడు.

సోమసుందర్ రాకతో అంతా కబుర్లు ఆపేసి పేకాట మొదలు పెట్టారు. మొదట ఆనంద్ మొహ మాటపడి ఆడనంటే బావగారు బలవంతంగా ఒప్పించారు. ఆరోజు సాయంత్రం వరకు మావాళ్లు ఆనంద్‌ని వదిలి పెట్టలేదు. భోజనం తర్వాత కాసేపు క్యారమ్స్ ఆడారు. సాయంత్రం టీ తాగాక ఆనంద్‌ను అందరూ ముందుగేట్ వరకూ వచ్చి సాగనంపారు.

ఆ మర్నాడు నన్ను ఆఫీస్‌కి వెళ్ళవద్దని చెప్పారు నాన్నగారు. అన్నయ్య, బావగారు, నాన్నగారు కలసి ఆనంద్ గురించి, అతని కుటుంబం గురించి వాకబు చేశారు. అన్ని విషయాలలో నాన్నగారు సంతృప్తి చెందాక ఆనంద్‌తో పెళ్ళిగురించి మాట్లాడే పనిని మాత్రం నాకే అప్పగించారు.

వారం రోజుల తర్వాత ఆనంద్‌ని కలిశాను.

కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడాక ఆనంద్ అన్నాడు.

"నిన్న మీ నాన్నగారు వచ్చి నన్ను కలిశారు"

ఆ మాట విని నేను ఆశ్చర్యపోయాను. నాన్నగారు నాకేమీ చెప్పలేదే! మళ్ళీ ఆనంద్ అన్నాడు.

"నీకు చెప్పినట్టే నా ఇబ్బందిని మీ నాన్నగారితో కూడా చెప్పాను. మీ అబ్బాయి లాయర్, మీ అమ్మాయి ఆర్కిటెక్ట్, మీ పెద్దల్లుడు చార్టర్డ్ అకౌంటెంట్. అందరూ విద్యాధికులు. మంచి హోదాల్లో వున్నవాళ్ళు. వారిమధ్య నేను సరితూగలేనని చెప్పాను".

"మరి నాన్నగారేమన్నారు?" ఆతురతగా అడిగాను.

"తను జీవితంలో పడిన కష్టాల గురించి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఈ స్థితికి రావడం గురించి వివులంగా చెప్పారు. 'నాకు చదువు లేకపోయినా అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముగ్గురు పిల్లల్ని చదివించగలిగాను. ఆ చదువు వారికి ఆభరణమే అయ్యింది కాని అహంకారాన్ని పెంచలేదు. అందరికీ అన్ని అవకాశాలు ఒంటబట్టదు. మరికొందరికి చదువుకోవాలనుకున్నా అవకాశాలు వుండవు. అంతమాత్రం చేత చదువుకుని డిగ్రీలు పొందినవాళ్ళే గొప్పవాళ్ళు కాదు. అలాగే ఉద్యోగాలు కూడా. పి.జి. చేసిన వారందరికీ సమానస్థాయి ఉద్యోగాలు రావు. ఒకరు పెద్ద ఆఫీసరైతే, మరొకరు కేవలం క్లర్క్‌గా మిగిలిపోతారు. అది వాళ్ళకు లభించే అవకాశాలపై ఆధారపడి వుంటుంది. కేవలం 'ఛాన్స్'. అంతే. సోమసుందర్ చాలా తెలివైనవాడు. మంచి నాలెడ్జ్ వున్నవాడు. కాని బస్ కండక్టర్‌గా స్థిరపడిపోయాడు. రఘురామ్‌ను, సోమసుందర్‌ను ప్రక్క ప్రక్కన నిలబెడితే సోమసుందరే ఎక్కువ మార్కులు కొట్టేస్తాడు. రఘురామ్ ఛార్టర్డ్ అకౌంటెంట్ అయినా సోమసుందర్ అతన్ని అన్ని విషయాలలోనూ డామినేట్ చేయగలడు కాని అతడు కేవలం బస్ కండక్టర్. కండక్టర్ అయిన సోమును తక్కువగా అంచనావేయడం, రఘురామ్ గొప్పవాడుగా చూడడం తప్పు. మనుషుల్ని హోదాలనుబట్టి, డిగ్రీలనుబట్టి అంచనా వేసుకోకూడదు అని ఇలా చాలా చాలా చెప్పారు" అని ఆనంద్ రెండు క్షణాలు ఆగాడు.

నేను ఊపిరిబిగపట్టి అతనివంక చూశాను. ఆనంద్ ఏమీ మాట్లాడకుండా నావైపే చూస్తున్నాడు.

"ఇంతకీ చివరికి నువ్వేమన్నావ్?" అని వుండబట్టలేక అడిగేశాను. రెండు క్షణాల తర్వాత ఆనంద్ అన్నాడు.

"నన్ను చిన్నలుడి పోస్ట్‌కి ఓ.కే. చేశామన్నారు సరే అలాగే కానివ్వండి" అన్నాను అని చిరునవ్వు నవ్వాడు అప్పటివరకు ఉద్వేగంగా ఆనంద్ కళ్ళల్లో చూసిన నేను భరించలేని సిగ్గుతో కళ్ళు దించేసుకున్నాను.

—"మోతీలాస్య"

# పుస్తకం రాస్తానంటున్న జగపతి బాబు

జీవిత కథలు వ్రాసే వారంటే ఎందుకో ఆంధ్రమహాజనులు ఉలిక్కిపడుతున్నారీమధ్య. అయితే తెలుగు వెండి తెరపై యాక్షన్ అండ్ గ్లామర్ హీరోగా వెలిగిపోతున్న జగపతి బాబు మాత్రం ఎవరి జీవిత కతా వ్రాయడం లేదు. తన అనుభవాలను ఆధారంగా చేసుకొని ఒక పుస్తకం మాత్రం రాస్తారట. అదీ ఇప్పుడు కాదు. తన సినీ జీవిత చరమాంకంలో. "ఎంత కష్టపడితే సుఖం అనుభవించవచ్చు" అన్న సత్యాన్ని నేనీ పుస్తకం ద్వారా చెప్పాలనుకుంటున్నాను' అని జగపతి బాబు వివరించారు. "చూడండి! నేను కెరీర్ ప్రారంభం నుంచి ఎన్నో ఇబ్బందులనెదుర్కొన్నాను, అవన్నీ నాకు మంచి అనుభవాలే " అని అంటున్న జగపతి బాబు తెలుగు పాఠకులని మరీ ఇంత దీర్ఘకాలిక సస్పెన్స్‌లో వుంచడం మాత్రం బాగాలేదు.

